

రైతు వేదికల నిర్వహణకు నిధులేవీ?

- ఏడాదికి పైగా విడుదలకాని నిధులు
- ప్రతి నెలా ఒక్కో వేదికకు రూ. 9,500 వేలు
- ఇబ్బందులు పడుతున్న ఏఈవోలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో గల రైతు వేదికలు వ్యవసాయ విస్తరణాధికారుల(ఏఈవో)కు భారంగా మారాయి. వాటి నిర్వహణకు నెలనెలా ఇచ్చే నిధులను ఏడాదికి పైగా ఇవ్వకపోవడంతో ఏఈవోలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం విద్యుత్ చార్జీలు కూడా చెల్లించే పరిస్థితి లేదు. రైతులు నిరంతరం సమావేశాలు నిర్వహించుకుని పంటల సాగులో కొత్త విధానాలతో పాటు అధికారుల సూచనలు, సలహాలు తెలుసుకునేందుకు వీలుగా జిల్లాలో రైతు వేదికలను గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయ క్లస్టర్ల వారీగా 54 రైతువేదికలను నిర్మించింది. వ్యవసాయ విస్తరణ అధికారులు.. రైతులకు అందుబాటులో ఉండే విధంగా రైతు వేదికల్లో వసతులు కల్పించారు. ప్రత్యేకంగా ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. శిక్షణ కార్యక్రమాలకు అవసరమైన కుర్చీలు, మైక్ సెట్ వంటివి కూడా అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ నిధులతో పాటు రైతుల తోడ్పాటుతో కొన్నిచోట్ల అవసరమైన వసతులు సమకూర్చారు. వీటిలో సీజన్‌ల వారీగా పంటల సాగుపై రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఇటీవల జరిగిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు వేదికల్లో వ్యవసాయశాఖ రైతులతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వం రైతుల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. వీటిని ఇతర శాఖలు కూడా వినియోగించుకుంటున్నాయి. వ్యవసాయ అధికారులతో పాటు రైతు సమితి అధ్యక్షుడి భాగస్వామ్యంతో కార్యక్రమాలు చేపడుతున్నారు. రైతువేదికలు కొన్ని గ్రామాలకు దగ్గరగా ఉన్నా, మరికొన్నింటిని దూరంగా నిర్మించారు. వీటిలోనే క్లస్టర్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఒక్కో రైతు వేదికకు 22 లక్షల రూపాయలు వెచ్చించారు. వీటి నిర్వహణకు మొదట నిధులు కేటాయించలేదు. రైతు వేదికను నిత్యం శుభ్రం చేసేందుకు, విద్యుత్ చార్జీలు, తాగునీటి కోసం, స్టేషనరీ, మరమ్మతుల కోసం ఎలాంటి నిధులు కేటాయించలేదు. ఆ తర్వాత కొద్ది నెలల తర్వాత గత ఏడాది ఒక్కో రైతు వేదిక నిర్వహణ కోసం ప్రభుత్వం 9,500 రూపాయలు కేటాయించింది. ఇందులో పరిశుభ్రత, కాపలా దారుకు మూడు వేల రూపాయలు, విద్యుత్‌కు రూ. 1000, స్టేషనరీ ఖర్చులకు 1000 రూపాయలు, తాగునీటికి రూ. 1000, శిక్షణ కార్యక్రమాలకు 2,500 రూపాయలు కేటాయించింది. రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం తగిన నిధులు విడుదల చేయకపోవడంతో ఏఈవోలు ఇబ్బందులు పడుతున్నారు. 2022 ఆగస్టు వరకు ప్రతినెల 9,500 చొప్పున నిధులు కేటాయించింది. సెప్టెంబరు నుంచి డబ్బులు రావడం లేదు. దీంతో ఏఈవోలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ చార్జీలు చెల్లించాలని ఆ శాఖ సిబ్బంది ఒత్తిడి తెస్తుండడంతో పరిస్థితిని మండల అధికారులకు, వారు జిల్లా అధికారికి వివరించారు. డబ్బులు విడుదల చేయాలని గతప్రభుత్వానికి కూడా విన్నవించినప్పటికీ, విడుదల చేయలేదు.

● యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో..

ప్రస్తుతం యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు వివిధ రకాల పంటల సాగుపై రైతులకు శిక్షణ తరగతులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది. ఒకప్పుడు ఏఈవోలు గ్రామా లకు వచ్చినప్పుడు గ్రామపంచాయతీ కార్యాలయాలనే వినియోగించు కునే వారు. ఐదు వేల రైతులకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి రైతు వేదికలను నిర్మించడం వల్ల వాటిని వ్యవసాయ శాఖ క్లస్టర్ కార్యాల యాలుగా ఉపయోగించుకుంటున్నారు. ఈ వేదికల వల్ల ఏఈవోలు రైతులకు అందుబాటులో ఉంటున్నారు. వాటి నిర్వహణకు సంబంధించి నెలనెలా ఇవ్వాల్సిన డబ్బులను ఇవ్వకపోవడంతో ఏఈవోలు ఇబ్బందులు పడుతున్నారు. స్వీపర్‌కు, తాగునీటి కోసం ప్రస్తుతానికి సొంతంగా సర్దుబాటు చేస్తున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి రైతు వేదికల నిర్వహణకు డబ్బులు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే చొరవతో ఎస్సారెస్పీ కాల్వ మరమ్మతులు

- మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్



ఎక్స్‌కావేటర్‌తో కాలువ పూడిక తీస్తున్న దృశ్యం

కాల్వశ్రీరాంపూర్, జనవరి 1: ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చొరవతో ఎస్సారెస్పీ కాలువ మరమ్మతులు చేపట్టినట్టు మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ అన్నారు. పెద్దపల్లి మండలం గుర్రపల్లె నుంచి కాల్వశ్రీరాంపూర్ మండలం ఎదులాపూర్ వరకు డీ83 ఉపకాల్వ 22ఆర్ఎస్ 4 కాలువ పూర్తిగా చెడిపోయి ఎస్సారెస్పీ కాలువ నీరు ఎదులాపూర్‌తో పాటు పలు గ్రామాల రైతుల పంటలకు సాగునీరందక ఇబ్బంది పడుతున్న విషయాన్ని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే విజయరమణారావు రెండు ఎక్స్‌కావేటర్ల ద్వారా ఎస్సారెస్పీ కాలవలో ఉన్న చెత్తను, మట్టిని తొలగిస్తున్నట్టు సారయ్యగౌడ్ తెలిపారు. కాలువలో చెత్త, మట్టి తొలగించడంతో పాటు కాలువకు అక్కడక్కడ సిమెంట్ పగుళ్లు ఏర్పడ్డాయని, వాటిని కూడా మరమ్మతు చేయిస్తామన్నారు. వారం రోజుల్లో ఎదులాపూర్ వరకు డీ83ఎస్సారెస్పీ కాల్వ ద్వారా రైతులకు సాగునీరు అందించి యాసంగి పంటలను ఆదుకుంటామన్నారు. ఎన్నో ఏళ్లుగా పూడికతో నిండిపోయిన ఎస్సారెస్పీ కాలువ మరమ్మతులు చేయిస్తున్న ఎమ్మెల్యేకు మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, సర్పంచ్ వెంకన్న, డైరెక్టర్ కొత్తూరు మొండయ్య, మాజీ కో ఆప్షన్ మెంబర్ కలిమోద్దీన్, ఎండీ మునీర్, అటికం శంకర్, పనాస మల్లయ్య, మోహన్‌రెడ్డి, హరీష్, మెట్టు శ్యామ్, గొర్ల దేవేందర్, సుధాకర్, అరకటి సదయ్య, దార సదానందం, సుమన్, రమేష్‌గౌడ్, జక్కుల సురేష్, నేదునూరి అఖిలేష్, అనూష, మోహన్‌రెడ్డి, రానవేన రవీందర్ పాల్గొన్నారు.

ఎన్టీపీసీ సీజీఎంకు ఈడీగా పదోన్నతి

జ్యోతినగర్, జనవరి 1: రాముగుండం ఎన్టీపీసీ చీఫ్ జనరల్ మేనేజర్ కేదార్ రంజాన్ పాండుకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)గా పదోన్నతి లభించింది. రామగుండం ప్రాజెక్టులోనే ఈడీగా ఆయనకు పోస్టింగ్ కల్పిస్తూ ఎన్టీపీసీ డైరెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆరు నెలల క్రితమే కేదార్ రంజాన్ పాండు సీజీఎంగా రామగుండంకు బదిలీపై వచ్చారు.

ఏఎస్‌ఐగా పదోన్నతి



ఏఎస్‌ఐని అభినందిస్తున్న ఏసీపీ, ఎస్‌ఐ

కమాన్‌పూర్, జనవరి 1: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న భూక్య బాలాజీనాయక్‌కు ఏఎస్‌ఐగా పదోన్నతి పొందారు. 1992లో కానిస్టేబుల్‌గా పదవీ బాధ్యతలను స్వీకరించారు. మంథని, కరీంనగర్, పెగడపల్లి, కమాన్‌పూర్, గోదావరిఖని టుటౌన్, కొయ్యూర్, పెద్దపల్లిలో పనిచేసి ప్రస్తుతం కమాన్‌పూర్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఈ మేరకు ఆయనకు ఏఎస్‌ఐగా పదోన్నతి రాగా ఏసీపీ తులా శ్రీనివాస్‌రావు, ఎస్‌ఐ బేతి రాములు స్టార్ పెట్టి పదోన్నతి పొందిన బాలాజీనాయక్‌ను అభినందించారు. సిబ్బంది రహీం, బాపన్న, తిరుపతి, జంపన్న శ్రీనివాస్, రమేష్, సతీష్, శ్రీలత, అంజలి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు ప్రోత్సాహం

- నాబార్డు ఏజీఎం జయప్రకాష్



మహిళలకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న నాబార్డ్ ఏజీఎం

సుల్తానాబాద్, జనవరి 1: మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంలో, వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు గాను నాబార్డు సంస్థ ప్రోత్సాహం అందిస్తుందని నాబార్డ్ ఏజీఎం జయప్రకాష్ అన్నారు. నాబార్డ్ వారి సహకారంతో మగ్గం వర్క్ శిక్షణ పొందిన 30 మంది మహిళలకు సోమవారం సర్టిఫికెట్లను అందజేశారు. సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీవాణి కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏజీఎం జయప్రకాష్ మాట్లాడుతు మహిళలు యువత స్వయం ఉపాధి అవకాశాల కోసం ఆసక్తి చూపుతున్నారన్నారు. వారిని ప్రోత్సహించడంలో భాగంగా నాబార్డు ఆధ్వర్యంలో వారికి నైపుణ్య శిక్షణ తరగుతులు నిర్వహించి వారి ఎంచకున్న రంగాల్లో రాణించే విధంగా తీర్చిదిద్ది ఆర్థికంగా ఎదగడంలో తమ సహకారం ఉంటుందన్నారు. పలు రంగాల్లో శిక్షణ పొందిన మహిళలు యువత వ్యాపారాల్లో రాణించేందుకు ఆర్థిక పరమైన సహకారాన్ని అందిస్తున్నామని బ్యాంకుల ద్వారా రుణాలు ఇస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్పందన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, లీగల్ కమిషన్ మెంబర్ శోభారాణి మాట్లాడుతు తమ సంస్థ ద్వారా తెలంగాణ వ్యాప్తంగా మహిళలు ఎంచుకున్న రంగాల్లో, వారు ఆసక్తి చూపుతున్న రంగాల్లో వారికి శిక్షణ ఇప్పించి నాబార్డు ద్వారా, బ్యాంకుల ద్వారా వారికి రుణాలు ఇప్పించి స్వయం ఉపాధి రంగాల్లో రాణించేలా కృషి చేస్తున్నామన్నారు. పదేళ్లలో 9,958 మంది మహిళలు తాము శిక్షణ ఇప్పించామన్నారు. ఎంపీపీ బాలాజీరావు మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ కార్యక్రరాల ద్వారా యువతలో, మహిళల్లో ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా మగ్గం వర్క్‌లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీవాణి విద్యాసంస్థల కరస్పాండెంట్, డైరక్టర్లు రేకులపల్లి శశంక, సుష్మా, ప్రిన్సిపాల్ కమలాకర్, నర్సయ్య, శ్యామల పాల్గొన్నారు.

అధ్వానంగా కాల్వ శ్రీరాంపూర్-పొత్కపల్లి రహదారి



గుంతలు పడిన రోడ్డు



గుంతలు పడిన రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనం

కాల్వశ్రీరాంపూర్, జనవరి 1: కాల్వశ్రీరాంపూర్ నుంచి పొత్కపల్లికి వెళ్లే రహదారి గుంతలతో అధ్వానంగా తయారయ్యింది. మండల కేంద్రం నుంచి పొత్కపల్లికి వందలాది వాహనాలు ప్రతీ రోజు నడుస్తుంటాయి. కాల్వ శ్రీరాంపూర్, పందిళ్ల, పెద్ద కొమిర ద్వారా ప్రతీ రోజు ఈ మండల ప్రజలు ట్రైన్ ఎక్కేందుకు ఓదెలకు తరలిపోతుంటారు. సిర్పూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ట్రైన్ ఓదెల రైల్వేస్టేషన్‌లోనే ఆగుతుంది. హైదరాబాద్‌కు వెళ్లే వారు ఈ ట్రైన్‌కు వెళ్లాలనుకుంటే రహదారి బాగా లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రైన్‌కు హైదరాబాద్‌కు వెళ్లే వారు ఓదెలకు చేరుకునేందుకు రోడ్డు గతుకులు ఉన్న కారణంగా ట్రైన్ సమయానికి చేరలేక పోతున్నామని ప్రయాణికులు పేర్కొంటున్నారు. అదేవిధంగా పందిళ్ల, మల్లయ్యపల్లె గ్రామ ప్రజలు తమ పనుల నిమిత్తం ప్రతిరోజు జమ్మికుంటకు వెళ్లి వస్తుంటారు. ఈ గ్రామాల ప్రయాణికులు పొత్కపల్లి ద్వారా జమ్మికుంటకు వెళ్లే దారిలో రహదారి మరీ అధ్వానంగా తయారయ్యింది. ద్విచక్ర వాహనదారులు గుంతల రోడ్డు కారణంగా రాత్రిపూట ప్రయాణం చేసేటప్పుడు అదుపుతప్పి పడిపోతున్నామని ద్విచక్ర వాహనదారులు పేర్కొంటున్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలంతో పాటు ముత్తారం, తాడిచర్ల తదితర మండలాల నుంచి భక్తులు ఓదెల దేవస్థానానికి ప్రతి బుధ, ఆదివారాలు వెళుతుంటారు. రహదారి సరిగాలేని కారణంగా భక్తులు గంగారం, పెగడపల్లి, నాంసానిపల్లి ద్వారా ఓదెల దేవస్థానానికి వెళ్లాల్సి వస్తుందని, ఈ రహదారిని బాగు చేయిస్తే ఓదెల దేవస్థానం మండల కేంద్రానికి దగ్గరవుతుందని భక్తులు పేర్కొంటున్నారు. గతంలో కాల్వ శ్రీరాంపూర్ నుంచి పొత్కపల్లి వరకు డబుల్ రోడ్డు మంజూరైనట్టు ప్రచారం కూడా జరిగింది. ప్రభుత్వం స్పందించి కాల్వ శ్రీరాంపూర్ నుంచి పొత్కపల్లి వరకు రహదారికి తారురోడ్డు వేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రాజు

ఎల్లారెడ్డిపేట, జనవరి 1: స్వేరో నెట్‌వర్క్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎల్లా రెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన మారుపాక రాజు సోమవారం నియమితులయ్యారు. జిల్లాలో స్వేరోలను పటిష్టపర్చడంతో రాజు కీలకపాత్ర పోషించారు. ఈ సందర్భంగా రాజు స్వేరో నెట్‌వర్క్‌లోని అన్ని అనుబంధ సంఘాలను కలిపి ఒక సంఘంగా ఏర్పాటు చేశారని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసు సేవా పతకాలకు పలువురి ఎంపిక

జగిత్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు సేవా పతకానికి జగిత్యాల జిల్లా నుంచి ఆరుగురు పోలీసు అధికారులు, ఉద్యోగులు ఎంపికయ్యారు. సోమ వారం రాష్ట్ర హోం శాఖ ప్రకటించిన సేవా పతకాలకు జగిత్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్‌ఐ మహమ్మద్ సామ్ దానీ, మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్‌ఐ శ్రీపెరంబదూరు ఆంజనేయులు, జగిత్యాల దరూర్ క్యాంపు లో పనిచేస్తున్న ఏఆర్ ఎస్‌ఐ వెన్నంపల్లి రవీందర్, కోరుట్ల అటాచ్డ్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అవుదుర్తి తిరుపతి, వెల్గటూరు హెడ్ కానిస్టేబుల్ అత్రం బహదూర్ షా ఎంపికయ్యారు. మెట్‌పల్లి ఫైర్ స్టేషన్‌లో లీడింగ్ ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్న ఆంజనేయులు స్టేట్ ఫైర్ సర్వీస్ ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు.

● రాజన్న సిరిసిల్ల జిల్లాలో..

సిరిసిల్ల క్రైం: రాజన్న సిరిసిల్ల జిల్లాలో నలుగురు పోలీసు అధికారులు, ఒక ఫైర్ అధికారి పోలీస్ ఉత్తమ సేవా పతకాలకు ఎంపికయ్యారు. జిల్లాలో పోలీసుశాఖలో పని చేస్తున్న పున్నం మహేందర్‌రెడ్డి (ఏఆర్ ఎస్‌ఐ), ఎం రాజ్‌కుమార్ (ఏఆర్ హెచ్‌సీ), గొంటి ప్రభాకర్ (రుద్రంగి హెడ్ కానిస్టేబుల్), గోనె తిరుపతి (ఏఆర్ హెచ్‌సీ), కె మహేం ద్రాచారి (ఫైర్‌మెన్, వేములవాడ) సేవా పతకాలకు ఎంపికయ్యారు.

● రామగుండం కమిషనరేట్‌లో..

కోల్‌సిటీ: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆరుగురికి పోలీస్ సేవా పతకాలు లభించాయి. ఏఆర్ఎస్‌ఐ కాంపెల్లి లింగయ్య, మంచిర్యాల ట్రాఫి క్ ఎస్‌ఐ నీరటి రామరాజు, తాళ్లగురిజాల ఏఎస్‌ఐ మామిడి రాజన్న, పెద్దపల్లి ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ నీర్ల వేణుగోపాల్, లక్సెట్టిపేట హెడ్ కానిస్టేబుల్ ఇస్తాకర్ అహ్మద్, దండేపల్లి హెడ్ కానిస్టేబుల్ అజ్మీరా గంగ్యా నాయక్‌లు పతకాలకు ఎంపికయ్యారు.

రేపు కరీంనగర్ జోన్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 1: పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 3న ఉదయం 9 గంటలకు నగునూరులోని గ్రామీణ క్రీడా ప్రాంగణంలో కరీంనగర్ జోన్ స్థాయి అండర్-14 బాలబాలికలకు సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీల ను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పోతన శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులు ఫొటోపై హెడ్‌మాస్టర్ సంతకం చేసిన ఎలి జిబులిటీ ఫాం, స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ తో హాజరు కావాలని సూచించారు.

రేపు కట్కాపూర్‌కు కేంద్ర బృందం రాక

రాయికల్, జనవరి 1: మండలంలోని కట్కాపూర్ పల్లె దవాఖానాను ఈ నెల 3న కేంద్ర బృందం పరిశీలించనున్నట్లు జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ నాణ్యతా ప్రమాణాల పరిశీలన (ఎన్‌క్వాస్)లో భాగంగా బృందం పరిశీలించి ఏడు విభాగాల్లో అందుతున్న సేవలను, రికార్డులను పరిశీలిస్తారని చెప్పారు. ఆయా విభాగంలో ఉన్నత మార్కులు సాధిస్తే యేటా మూడేళ్ల పాటు నిధులు మంజూరవుతాయన్నారు. జాతీయ గుర్తింపు పొందడానికి పల్లె దవాఖానాను సిద్ధం చేశామన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

జగిత్యాల రూరల్, జనవరి 1: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆల యంలో పూజలు చేయడానికి స్కూటీ పై వెళ్తున్న మహిళను మృత్యువు కబళిం చింది. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల పట్టణంలోని మహాలక్ష్మీనగర్‌కు చెందిన సామ సుజాత (42) తన స్కూటీ పై జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస ఆలయంలో పూజలు చేయడానికి బయ ల్దేరింది. పొలాస వద్ద గల ఆలయ కమాన్ సమీపంలో ధర్మపురి వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు సుజాతను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుజాత తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. అక్కడే ఉన్న స్థానికులు సుజాతకు సీపీఆర్ చేసినా ఫలితం లేకుండాపోయింది. మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. సుజాతకు కూతురు ఉంది. సుజాత భర్త హేమేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

మహాలక్ష్మి స్కీంపై ఆర్టీసీ సిబ్బందికి సూచనలు

భగత్‌నగర్, జనవరి 1: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కరీంనగర్ జోన్ ఈడీసోమవారం మహాలక్ష్మి స్కీంపై సిబ్బందికి సూచనలు అందజేశారు. కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ఆవరణలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి ఆర్టీసీ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, డిప్యూటి రీజినల్ మేనేజర్ (మెకానిక్) ఎం సత్యనారాయణ, పర్సనల్ ఆఫీసర్ ఎంచంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, బస్టాండ్ ఎంటీఎం రజనీకృష్ణ, కరీంనగర్-1, 2 డిపో మేనేజర్లు ఎల్ మల్లేశం, వి మల్లయ్య, ఏటీఎం కార్గో ఎన్ సదాశివ, బస్టాండ్ అసిస్టెంట్ మేనేజర్ అంజయ్య పాల్గొన్నారు.

కిందపడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 1: కరీంనగర్ కట్టరాంపూర్‌లోని ఒక అపార్ట్ మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న గొర్రె లక్ష్మీరాజం(55) కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడు చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. కిసాన్‌నగర్‌కు చెందిన లక్ష్మీరాజం కట్టరాంపూర్‌లోని అపార్ట్‌మెంట్‌లో వాచ్ మన్‌గా ప ని చేస్తున్నాడు. డిసెంబరు 29న మధ్యాహ్నం అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే ఆంజనేయులుకు చెందిన ఆవుదూడ బయటకు పరుగెడుతుం డగా అడ్డుగా పోయి తాడు కాళ్లకు తట్టుకుని కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు హైదరాబాద్ నిమ్స్‌కు తర లించారు. చికిత్సపొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. దూడ యజమాని ఆంజనేయులుపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య కనకతార పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మానేరులో చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి


దాసరి శ్రావణ్(ఫైల్)

గన్నేరువరం, జనవరి 1: లోయర్ మానేరు డ్యాంలో చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ చందా నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హన్మాజిపల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రావణ్(22) సోమవారం ఉదయం లోయర్ మానేరు డ్యాంలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. రోజు లాగే శ్రావణ్ ఉదయం 6గంటలకు బైక్‌పై చేపల వేటకు డ్యాంకు వెళ్లి మధ్యాహ్నం అయినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి వెంకటయ్య మరికొంత మందితో కలిసి తెప్పలపై మానేరు నీటిలో వెతకడంతో యువకుడి మృతదేహం లభ్యమైంది. తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నూతన సంవత్సరం రోజే యువకుడు మృతి చెందడం గ్రామంలో విషాదం నింపింది. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

● మల్యాల యువకుడి మృతి


అరుణ్‌కుమార్(ఫైల్)

చందుర్తి, జనవరి 1: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. మల్యాలకు చెందిన నేదూరి అరుణ్‌కుమార్ (28) అనే యువకుడు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో పాల వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున తన ద్విచక్రవాహనంపై పాలను సరఫరా చేసేందుకు వెళ్తున్నాడు. మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కొన్ని సంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన అనూష అనే యువతిని కులాంతర వివాహం చేసుకున్నాడు. అరుణ్‌కుమార్‌కు తల్లిదండ్రులు చంద్రయ్య, లక్ష్మీనర్సవ్వ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మత్స్యకారుడి మృతి

ఇల్లంతకుంట, జనవరి 1: మండలంలోని రంగపేట గ్రామానికి చెందిన ఎలవేని పర్శరాం (55) అనే మత్స్యకారుడు సోమవారం రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. పర్శరాం సోమవారం ఉదయం చేపలు పట్టడానికి ద్విచక్రవాహనంపై మధ్యమానేరుకు బయల్దేరాడు. వల్లంపట్ల గ్రామసమీపంలో ప్రమదవశాత్తు వాహనం పైనుంచి రోడ్డు పక్కన ఉన్న బురదలో పడి మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

పెద్దపల్లి రూరల్, జనవరి 1: మండలంలోని పెద్దకల్వల గ్రామానికి చెందిన అర్నకొండ మల్లమ్మ (80) అనే వృద్ధురాలు గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందింది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ మహేందర్ తెలిపారు.

రాజన్న సేవలో ప్రముఖులు


ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

వేములవాడ, జనవరి 1 : వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ పర్యవేక్షకుడు తిరుపతిరావు ప్రసాదం అందజేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయన వెంట ఉన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన కొత్త ఇన్నోవా వాహనానికి రాజన్న సన్నిధిలో సోమవారం సాయంత్రం ఆది శ్రీనివాస్ పూజలు నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్వామివారిని దర్శించుకొని కోడె మొక్కు చెల్లించుకున్నారు.

రాజన్న సేవలో జడ్పీ చైర్ పర్సన్

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు న్యాలకొండ అరుణ సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అర్చకులు ఆశీర్వచనం గావించారు.

రాజన్న సేవలో ఎన్నికల పరిశీలకుడు

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎన్నికల పరిశీలకుడు మణిగండ స్వామి వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం, స్వామివారి ప్రసాదం అందజేశారు.

రాజస్థాన్‌లో ఆర్మీ జవాన్ మృతి

● జగ్గారావుపల్లిలో విషాదం


శివకుమార్ (ఫైల్)

బోయినపల్లి, జనవరి 1: బోయినపల్లి మండలం జగ్గారావుపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ చాడ శివకుమార్ (23) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. శివకుమార్ సీఐఎస్ఎఫ్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. బంధువులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శివకుమార్ రెండేళ్ల క్రితం సీఐఎస్ఎఫ్‌లో ఉద్యోగం పొందాడు. రాజస్థాన్‌లోని డిలోలిలో 16వ బెటాలియన్‌లో డాక్యుమెంటరీ సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తుండగా డిసెంబరు 16న బాత్ రూమ్‌లో జారీ కిందపడ్డాడు. తలకు గాయమై కోమాలోకి వెళ్లాడు. తోటి సిబ్బంది జైపూర్‌లోని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. శివకుమార్ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దసరా పండుగ సందర్భంగా స్వగ్రామానికి వచ్చిన శివకుమార్ అనంతరం తిరిగి విధులకు వెళ్లాడు. ఇటీవల తెలంగాణలో నిర్వహించిన కానిస్టేబుల్ పరీక్షల్లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. శిక్షణకు సమయం ఉండడంతో తిరిగి రాజస్థాన్ వెళ్లి విధుల్లో చేరాడు. శివకుమార్ తల్లిదండ్రులు ఇద్దరు గోపాల్‌రెడ్డి భాగ్యమ్మ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోదరుడు గంగారెడ్డి సిరిసిల్లలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. శివకుమార్ మృతితో గ్రామంలో విషాదం చోటుచేసుకుంది.

ప్రమాదకరంగా రహదారి

● వారం వ్యవధిలో వాహనాలు ఢీకొని ఇద్దరి మృతి
● కనిపించని హెచ్చరిక బోర్డులు

హుజూరాబాద్ రూరల్, జనవరి 1: హుజూరాబాద్ మండలం మీదుగా వెళ్తున్న ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారుతోంది. వారం వ్యవధిలో వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. మండలంలోని తుమ్మనపల్లి శివారులో డిసెంబరు 27న సింగాపూర్ గ్రామానికి చెందిన గాడి అనిల్‌రెడ్డి(29) స్వగ్రామానికి వరంగల్-కరీంనగర్ ప్రధాన రహదారిపై వస్తున్న క్రమంలో ఓ లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డిసెంబరు 28న అర్ధరాత్రి జాతీయ రహదారి పనుల్లో కూలీ పనిచేస్తున్న వినోద్ కోలే(29) తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై పనినిమిత్తం బయటికి వెళ్లి తిరిగి సింగాపూర్‌కు వెళ్తున్న క్రమంలోనే గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వచ్చి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదం లో వినోద్ కోలే అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని తుమ్మన్నపల్లి, సింగాపూర్ గ్రామాల సమీపంలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. జమ్మి కుంట-హుజూరాబాద్ ప్రధాన రహదారిపై శాలపల్లి-ఇందిరానగర్, చెల్పూర్, రంగాపూర్, సిర్సపల్లి, పర్కాల్ క్రాస్, కందుగుల, దమ్మక్కపేట క్రాస్‌లు డేంజర్ స్పాట్‌గా మారాయి.


రంగాపూర్‌లో జమ్మికుంట-హుజూరాబాద్ రహదారిపై ప్రమాద దృశ్యం(ఫైల్)

రక్షణ చర్యలు చేపట్టాలి
- బాషవేణి రాజేష్‌యాదవ్, సింగాపూర్



సింగాపూర్ శివారులో రాత్రి పూట ప్రధాన రహదారిపై బైక్‌తో వెళ్లాలంటే భయపడుతున్నాం. భారీ వాహనాలు వేగంగా రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. డేంజర్ స్పాట్‌ల వద్ద అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలి.

వాహనదారులు నిబంధనలను పాటించాలి
-సిరాజ్ ఉర్ రహమాన్, ఎంవీఐ, హుజూరాబాద్



ప్రతి వాహనదారుడు నియమ నిబంధనలు పాటించాలి. స్పీడ్ బ్రేకర్ల వద్ద, మూల మలుపుల వద్ద, టర్నింగ్ పాయింట్లు, సైడ్ తీసుకుంటున్న సమయంలో ఇండికేటర్‌లను తప్పనిసరిగా వినియోగించాలి. రాత్రిపూట లైట్స్ లేకుండా వాహనాలను నడపవద్దు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలి

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి,జనవరి 1: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక కృషి చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రేకొండలోని హాళిక్ శ్రమజీవి కోఅపరేటివ్ సొసైటీలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా సీపీఐ బలోపేతం అవుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ పార్టీని గద్దె దించడమే సీపీఐ ఏకైక లక్ష్యం అన్నారు. మతం, కులం పేరుతో పనిచేస్తున్న బీజేపీకి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడితే ఏ పార్టీని సహించేది లేదన్నారు.

ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె స్వామి, ఎంపిటిసి అందె స్వప్న-స్వామి, సింగిల్ విండో డైరెక్టర్లు చాడ శ్రీదర్‌రెడ్డి, ముద్రకోల రాజయ్య, సొసైటీ చైర్మన్ మండల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

వెల్గటూర్, జనవరి 1: మండలంలోని స్తంభంపల్లి గ్రామానికి చెందిన భూపెల్లి పోచమ్మ (64) అనే మహిళ సోమవారం అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు పోచమ్మ సంవత్సర కాలంగా గొంతు క్యాన్సర్‌తో బాధ పడుతోంది. వ్యాధి నివారణకు చికిత్స నిమిత్తం ప్రతి రెండు రోజులకు ఒకసారి కరీంనగర్ ఆసుపత్రికి వెళ్లి కీమో థెరపీ చేయించుకునేది. నాలుగు రోజులుగా వ్యాధి తీవ్రత పెరగడంతో భరించలేక జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. పోచమ్మ భర్త భూపెల్లి గంగయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నందగిరిని కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలి

గంగాధర, జనవరి1: కరీంనగర్ జిల్లాలో కోట్ల నర్సింహులపల్లిలో విశేష చారిత్రక, సాంస్కృతిక వారసత్వం కలిగిఉన్న ప్రాంతాన్ని నందగిరితో కలుపుతూ టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని చరిత్ర పరిశోధన సమితి కన్వీనర్ డాక్టర్ శ్రీనివాసరాజు అన్నారు. సోమవారం కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని గంగాధర మండలం కోట్ల నర్సింహులపల్లిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంస్కృతిక వారసత్వ సంపదను కలిగి నాటి నుంచి నేటి తరానికి దిక్సూచిగా నందగిరి కోట, కోట్లనర్సింహులపల్లి వీరభద్ర దేవాలయం, నరసింహుని దేవాలయాలతో పాటు జైనుల సంపద ఉందన్నారు. క్రీ.పూర్వం 3వ శతాబ్దం నుంచి జైన, వైష్ణవ మత సామరస్యానికి వేదికగా ఎందరో రాజులు పాలించిన కేంద్రంగా విరసిల్లిందన్నారు. ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం అభివృద్ధి పరుచుటకు చొరవ చూపాలన్నారు.చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రాంతాలైన కోటిలింగాల, బొమ్మలమ్మ గుట్ట, నందగిరి, ధర్మపురి,వేముల వాడను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ విధంగా చేస్తే పర్యాటకుల సంఖ్య పెరిగి ఈ ప్రాంతానికి ప్రాధాన్యతతో పాటు ఆదాయం, అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


దేవాలయాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసరాజు

రాజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

వేములవాడ, జనవరి 1: వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. ఆంగ్ల నూతన సంవత్సరం తొలిరోజు కావడం, మేడారం సమ్మక్క సారక్క జాతర సమీపిస్తుండడం కారణంగా పెద్ద సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. కళాభవన్‌లో స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో భక్తులు పాల్గొన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ఆలయ అధికారులు గర్భాలయంలోకి ప్రవేశం నిలిపివేసి లఘు దర్శనం అమలు చేశారు. సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయం లోకి ప్రవేశించిన భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకు న్నారు. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ ఆలయం భక్తులతో రద్దీగా మారింది. ఈ సందర్భంగా భక్తులు బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకొని బోనం మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ నేతృత్వంలో ఆలయ పర్యవేక్షకులు బి.తిరుపతి రావు, అల్లి శంకర్, పరిశీలకులు అశోక్, పవన్ తగిన ఏర్పాట్లు చేశారు. సోమవారం సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని, దాదాపు 20 లక్షల మేరకు ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు.



భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ ప్రాంగణం

గోదావరిఖనిలో కూలీ హత్య

కోల్‌సిటీ, జనవరి 1: గోదావరిఖని సప్తగిరికాలనీ మున్సిపల్ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ సమీపంలో ఆదివారం రాత్రి వెనచర్ల గంగాధరరావు(30) అనే కూలీ హత్యకు గురయ్యాడు. గంగాధర్‌రావు, అభితేజ అనే ఇద్దరు మద్యం సేవిస్తున్న సమయంలో గొడవ పడినట్టు తెలుస్తోంది. పరస్పరం దూషించుకోగా అభితేజ గంగాధర్‌రావు తలపై రాడ్‌తో కొట్టడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అభితేజ 108కు సమాచారం ఇచ్చాడు. 108 సిబ్బంది వచ్చే సరికే గంగాధరరావు మృతి చెందాడు. దీంతో అభితేజ, అతని భార్య సునీత పరారయ్యారు. అభితేజ వేములవాడలో ఒక బాలుడిని కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడు. పిల్లలు లేని అతడు పెంచుకునేందుకు బాలుడిని తీసుకెళ్లడంతో కేసు నమోదు అయ్యింది. మృతుడు గంగాధర్‌రావు స్వగ్రామం ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెం. అతని బంధువులకు సమాచారం ఇచ్చినట్టు వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు పేర్కొన్నారు.

ఇస్కాన్ మందిరంలో ఘనంగా పుష్పోత్సవం

మెట్‌పల్లి రూరల్, జనవరి, 1 : మండలంలోని పెద్దపూర్ గ్రామ శివారులోని ఇస్కాన్ మందిరంలో స్వామి వారికి పుష్పోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి కన్నుల పండుగగా నిర్వహించారు. పుష్పోత్సవ కార్యాక్రమానికి ముంబాయి, హైదరాబాద్, ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి భక్తులు పాల్గొని స్వామి వారిని సందర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా పలు రకాల పుష్పాలతో రాధా కృష్ణులకు అభిషేకం చేశారు. నిర్వాహకులు శ్రీమాన్ నరహరి ప్రభుజి ప్రవచనం ఇచ్చారు. భక్తులు నృత్యాలు చేస్తూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.


పెద్దపూర్‌లోని ఇస్కాన్ మందిరంలో ఉత్సవమూర్తులు


కోరుట్లలో అయ్యప్పస్వామికి లక్షపుష్పార్చన

కోరుట్లలో లక్షపుష్పార్చన

కోరుట్ల : పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో నూతన సంవత్సరం పురస్కరించుకొని సోమవారం లక్ష పుష్పార్చన మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో వేదపండితుడు పాలెపు రాంశర్మ, వినయ్ మంత్రోచ్ఛరణ మధ్య లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. మూల విరాట్‌కు అభిషేకం, అర్చన, పంచామృత అభిషేకాలను నిర్వహించారు. అనంతరం అయ్యప్పకు లక్ష పుష్పార్చన మహోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. అయ్యప్ప అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం జరపారు. ఈ కార్యక్ర మంలో అయ్యప్ప దేవాలయం గౌరవ అధ్యక్షుడు చిద్రాల నారాయణలతో పాటు పలువురు అయ్యప్ప స్వాములు భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు, అయ్యప్ప స్వాములకు బిక్షను అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

పత్తి అమ్మకానికి ఆన్‌లైన్ చిక్కులు

● వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం
● రైతులకు తప్పని అవస్థలు

జమ్మికుంట, జనవరి 1: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో పత్తి అమ్ముకునేందుకు వస్తున్న రైతులకు ఆన్‌లైన్ చిక్కులు తప్పడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు పత్తి పంటల వివరాలు పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పత్తి అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు వస్తున్న రైతులకు తమ పేర్లు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. పేరు కనిపించినా, పంట విస్తీర్ణం తక్కువగా నమోదై ఉంటుంది. దీంతో తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. కనీస మద్ధతు ధర దక్కడం లేదని రైతులు వాపోతున్నారు.

సీసీఐ ద్వారా ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి సేకరణ

ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తిని మాత్రమే రైతుల నుంచి సీసీఐ సేకరిస్తోంది. అంతకు మించి అదనంగా క్వింటాల్ పత్తి కూడా సదరు రైతు సీసీఐకి విక్రయించుకునే పరిస్థితి లేదు. తక్కువ పంట విస్తీర్ణం నమోదైన రైతులు ఇతర రైతుల పేరు మీద అమ్ముకునే వెసులు బాటు ఉంది. ఆ రైతు తన పంటను మళ్లీ సీసీఐకి విక్రయించుకునే అవకాశం ఉండదు. మళ్లీ ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది.


జమ్మికుంట మార్కెట్‌కు వచ్చిన పత్తి వాహనాలు

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి

సుల్తానాబాద్, జనవరి1: సుల్తానాబాద్ మండలంలోని రేగడిమద్దికుంట గ్రామంలో చుక్క రాజు (31) అనే రైతు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగడి మద్దికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లయ్యపల్లి గ్రామానికి చెందిన చుక్క రాజు సోమవారం ఉదయం తన పొలానికి నీరు పెట్టడం కోసం ఇంటి నుంచి వెళ్లాడు. ఆలస్యమైనా ఇంటికి రాకపోవడంతో ఆయన అచూకీ కోసం చూడగా పొలం వద్ద మడుగులో పడి మృతి చెంది ఉన్నాడు. ఏదైనా అనారోగ్య కారణాలతో చనిపోయాడా లేక మరేదైనా కారణాలతో మృతి చెందాడో తెలియాల్సి ఉంది. ఈ మేరకు మృతుడు రాజు భార్య శైలజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.


చామకుంటలో నేలరాలిన పచ్చిమిర్చి(ఫైల్)

పంట నష్టపరిహారం వచ్చేనా?

● కొత్త ప్రభుత్వంపై ఆశలు ● వేలాది మంది రైతుల ఎదురుచూపులు

చొప్పదండి, జనవరి 1: గత ఏడాది ఏప్రిల్ చివరివారంలో కురిసిన వడగళ్ల వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఆరుగాలం శ్రమించిన పంటకాస్త అరగంట కురిసిన వడగళ్ల వర్షం ధాటికి పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. పెట్టిన పెట్టుబడి కాస్త భూమిపాలుకాగా అన్నదాత తీవ్రంగా నష్టపోయాడు. కనీసం వరిపొలం కోసే పరిస్థితి లేకుండా తగలబెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు 10 వేల రూపాయలు నష్ట పరిహారం చెల్లిస్తామని ప్రకటించి, నష్టపోయిన పంట పొలాలను సర్వే చేశారు. అధికారులు పంట నష్టజాబితాను ప్రభుత్వానికి నివేదించగా ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పంట నష్టపరిహారం రైతులకు అందలేదు. మండలంలో ఏప్రిల్ చివరి వారంలో కురిసిన వడగళ్ల వర్షం ధాటికి 5,083 ఎకరాల్లో వరి, కూరగాయలతోపాటు ఇతర పంటలు పూర్తిగా ధ్వంసమైపోయాయి. చొప్పదండిలో 1,140 ఎకరాలు, వెదురుగట్టలో 1,789 ఎకరాలు, చాకుంటలో 460 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. రుక్మాపూర్‌లో 392 ఎకరాల్లో, కొలిమికుంటలో 342, చిట్యాలపల్లిలో 124, గుమ్లాపూర్‌లో 342, మొత్తం 5,083 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 6,023 మంది రైతులు పంట నష్టపోగా, పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. అప్పులు తెచ్చి వ్యవసాయం చేసే పరిస్థితులు ఏర్పడ్డాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగా రైతులు పంట నష్ట పరిహారం వస్తుందని ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


చొప్పదండిలో ధ్వంసమైన వరి పంట(ఫైల్)

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు


సుల్తానాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు


కేక్ తినిపిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చందర్


కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు దీటి బాలరాజు

పాత సంవత్సరానికి బైబై చెబుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నూతన సంవత్సర వేడుకలను ఆదివారం అర్ధరాత్రి యువకులు, ప్రజలు ఘనంగా నిర్వహించారు. వాడవాడలా డీజే సౌండ్లు పెట్టుకుని నృత్యాలు చేస్తూ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు.

పెద్దపల్లి కల్చరల్, జనవరి 1: పెద్దపల్లి పట్టణంలోని శాంతినగర్ న్యూ బిలివర్ చర్చిలో 2024 నూతన సంవత్సర వేడుకల్లో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ఎమ్మెల్యే విజయరమణారావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నూగిళ్ల మల్లయ్య, సయ్యద్ మస్రత్, భూతగడ్డ సంపత్, ఉప్పు రాజు, శ్రీనివాస్, అమ్రేష్, దొడ్డుపల్లి జగదీష్, బండారి సునిల్ గౌడ్, నదీం, దేవరకొండ రాజు, శ్రావణ్, చర్చి ఫాస్టర్స్ , మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే విజయరమణారావు ఆకాంక్షించారు. సుల్తానాబాద్ పట్టణంలోని హోస్ట్రోన్ చర్చిలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అంతటి అన్నయ్య గౌడ్, ఊట్ల వరప్రసాద్, గుండ మురళి, మొండయ్య, చింతల సునిత రాజు, నిషాత్ రఫిక్, మోబిన్, రవీందర్ ఫాస్టర్స్ పాల్గొన్నారు.

ధర్మారం: మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో 2023 సంవత్సరానికి వీడ్కోలు పలికారు. 2024 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ అన్ని వర్గాల ప్రజలు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఆదివారం అర్ధరాత్రి పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేసి ట్రిబుల్ రైడింగ్ యువకులకు అవగాహన కల్పించి ప్రమాదాల నివారణకు తగు సూచనలు ఇచ్చారు. ధర్మారం మండల కేంద్రంలోని సాయిమణికంఠ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆ పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ జైన రమాదేవి, కరస్పాండెంట్ జైన సురేష్‌కుమార్ సోమవారం కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. పలు పార్టీల నాయకులు, వ్యాపారులు, యువకులు, మహిళలు నూతన సంవత్సన సంబరాలను జరుపుకున్నారు. ఉదయం ఇళ్ల ముందు మహిళలు ముగ్గులు వేశారు. ధర్మారం మండల కేంద్రంలోని మెగిద్దో మినిస్ట్రీస్ చర్చిలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా వృద్ధులకు ఫాస్టర్ జాన్ నెల్సన్ చీరలను పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి వృద్ధులకు, చిన్నారులకు స్వీట్లను పంపిణీ చేశారు.

మంథని: మంథని ప్రాంత ప్రజలంతా 2024 నూతన సంవత్సరానికి సోమవారం ఘనంగా స్వాగతం పలికారు. నూతన సంవత్సరానికి ఉత్సాహంగా స్వాగతం పలుకుతూ ఇళ్ల ముందు, షాపుల ముందు రంగు రంగుల ముగ్గులు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు నూతన సంవత్సర వేడుకలు కొనసాగాయి. బంధువులకు, మిత్రులకు ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నూతన సంవత్సరం నుంచి మంచి జరుగాలని కోరుకుంటూ పట్టణంలోని మహాలక్ష్మి, లక్ష్మీనారాయణస్వామి, అయ్యప్పస్వామి, కన్యకాపరమేశ్వరీ, షిరిడీసాయి, లలితాంబిక, భిక్షేశ్వర, ఓంకారేశ్వర, దత్త, విఘ్నేశ్వర, శీలేశ్వర-సిద్దేశ్వర, గౌతమేశ్వర, సరస్వతీమాత, హనుమాన్ ఆలయాల్లో, ఇళ్లలో భక్తులు పలు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మంథని పట్టణంలోని సీయోను ప్రార్థనా మందిరంలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో పాస్టర్ వల్లూరి ప్రభాకర్ వాక్యోపదేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన సంవత్సరంలో చెడు అలవాట్లను వదిలివేసి నూతన సంవత్సరంలో మంచి అలవాట్లతో ముందుకు సాగాలన్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు పెంద్రు ప్రసన్నకుమార్ మంథని మార్క్ కలువల సామ్యూల్, అజ్మీరా దయరాజు, గద్దల రాజేష్, ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా కోశాధికారి అంకరి కుమార్, సంఘ పెద్దలు మంథని ప్రసాద్, అందె రమేష్, చింతకుంట్ల ప్రేమ్ కుమార్, దాసరి నందానందం, ఈర్ల సదానందం రామగిరి కుమార్, అంకరి ప్రకాష్ లింగయ్య, కరుణాకర్ లు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాలనీలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. 17వ డివిజన్‌లోని కస్తూరిబా బాలికల పాఠశాలలో కేక్ కట్ చేసి, విద్యార్థినులకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, కిషన్‌నాయక్, రాజేశం, ఊదరి నరేష్, కుమార్, అశోక్, అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

● ప్రజలకు మరింత చేరువకావాలి: సీపీ


సీపీ రాజేశ్వరిని కలిసిన పోలీస్ అధికారులు

కోల్‌సిటీ: బేసిక్ పోలిసింగ్ విధానాన్ని అవలంభిస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమ రాజేశ్వరి పోలీస్ అధికారులకు సూచించారు. రామగుండం కమిషనరేట్‌లో నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం కేక్‌కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గత ఏడాది పోలీస్‌శాఖలో ఎన్నో నూతన ఒరవడికలు, అధునాతన సాంకేతికతను అందించడమే కాకుండా సిబ్బంది పూర్తి స్థాయి విధి నిర్వహణకు ఎంతో దోహదపడిందన్నారు. లా అండ్ ఆర్డర్ అధికారులు నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలు చట్ట పరిధిలో పరిష్కరించాలన్నారు. నూతన సంవత్సరంలో అధికారులు, సిబ్బంది వృత్తి పరంగా, వ్యక్తిగతంగా లక్ష్యాలను నిర్దేశించుకునే పని చేయాలన్నారు. నిత్యం ఒత్తిడితో పని చేస్తున్న పరిస్థితుల్లో ఆరోగ్యం కూడా జాగ్రత్త వహించాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు, సిబ్బంది సన్నద్ధంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా విధి నిర్వహణలో కృషి చేసిన అధికారులకు క్యాష్ రివార్డులను అందజేశారు. కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ సుధీర్‌కేకన్, ఏఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్ ఉల్ హక్, ఏసీపీలు తులా శ్రీనివాస్‌రావు, ఎడ్ల మహేష్, తిరుపతిరెడ్డి, సదయ్య, మోహన్, ఎస్‌బీ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, వెంకటేశ్వర్లు, ఏఆర్ ఏసీపీ మల్లికార్జున్, సుందర్‌రావు, సీసీ మనోజ్‌కుమార్, కమిషనరేట్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


సీపీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసులు

ఎలిగేడు: మండలంలోని శివపల్లిలో సోమవారం పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేష్, సుల్తానాబాద్ సీఐలు జగదీష్, అనిల్‌కుమార్, ఎస్సైలు వెంకటకృష్ణ, సర్కిల్ పరిధిలోని ఎస్సైలు ఎమ్మెల్యే విజయరమణారావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ పుష్పగుచ్చాలు అందించారు.

కళ్యాణ్‌నగర్: పాత సంవత్సరానికి బైబై చెబుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నూతన సంవత్సర వేడుకలను ఆదివారం అర్ధరాత్రి యువకులు ఘనంగా నిర్వహించారు. జులాయిల ఆగడాలు కట్టించేందుకు పోలీసులు ప్రతీ కూడలిలో పికెటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో పారిశ్రామిక ప్రాంతం పోలీస్ వలయంగా మారింది. ఆదివారం రాత్రి 10గంటల నుంచే గోదావరిఖని వన్‌టౌన్ సీఐలు ప్రమోద్‌రావు, ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. సోమవారం గోదావరిఖని చౌరస్తాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, కార్పొరేటర్లు ఇంజపురి పులేందర్, దొంత శ్రీనివాస్, దాతు శ్రీనివాస్, సాగంటి శంకర్ పాల్గొన్నారు. చౌరస్తాలోని వైట్ హౌస్‌లో కాంగ్రెస్ నాయకులు దీటి బాలరాజు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరంలో రామగుండం ప్రజలకు మంచి జరుగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కారం వినయ్, కోట రవి, మాణిక్యరావు, చుక్కల శ్రీనివాస్, బండారి రవి, హమీద్, కుర్మ శ్రీనివాస్, కనకయ్య, కత్తెర మల్ల రమేష్, సాయి, దాసరి విజయ్ పాల్గొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా మహిళలు ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు వేశారు.

● గనులపై వేడుకలు..

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 ఏరియాలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. జీఎం సూర్యనారాయణ అధికారులతో కలసి కేక్‌ను కట్‌చేశారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడారు. నూతన ఉత్తేజం తో పనిచేస్తు ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. డివిజన్‌ను సింగరేణిలో అగ్రగామిగా నిలిపేలా ప్రతి ఒక్క ఉద్యోగిపాటుపడాలని జీఎం సూచించారు. ఈసందర్భంగా ఏరియా ఉద్యోగులకు జీఎం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఎస్వోటూ జీఎం అబ్దుల్‌సలీం, అధికారులు నరసింహారావు, రాజేంద్రప్రసాద్, ధనుంజయ, వెంకట రామచంద్ర, మురళీకృష్ణ పాల్గొన్నారు.

● ఆర్జీ-2 ఏరియా వర్క్‌షాప్‌లో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. నాయకులు దశరథం, మార్కండేయ పాల్గొన్నారు. ఓసీపీ-1 సీహెచ్‌పీలో ఐఎన్‌టీయూసీ నాయకుడు కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులకు స్వీట్లు పంచారు. నాయకులు రవీందర్‌రెడ్డి, గడ్డం తిరుపతి, పోశయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ-3,ఏపీఏ డివిజన్‌లలో నూతన సంవత్సర వేడుకలను అధికారులు, జీఎం కార్యాలయం సిబ్బంది ఘనంగా జరుపుకున్నారు. జీఎం కార్యాలయంలోని పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు హాజరై కేక్‌ను కట్ చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న ఆర్జీ-2బ జీఎం సూర్యనారాయణ


వేడుకల్లో పాల్గొన్న ఆర్జీ-3, ఏపీఎం జీఎంలు, అధికారులు

అందుగులపల్లి అభివృద్ధికి నిధులు కేటాయించాలి


ఎమ్మెల్యే విజయరమణారావును కలిసిన కాంగ్రెస్ నాయకులు

పెద్దపల్లి రూరల్, జనవరి1: పెద్దపల్లి మండలం అందుగులపల్లి గ్రామ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి సహకారం అందించాలని సోమవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావును గ్రామ కాంగ్రెస్ నాయకులు కలిసి విన్నవించారు. నూతన సంవత్సరం సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండి గౌస్, సిద్ద గట్టయ్య, చీకటి చంద్రయ్య, గుండ లక్ష్మీనారాయణ, కోయ్యాడ కుమారస్వామి, గుర్రపు అంజయ్య, అరె రవి, భూగా మొగిలి, కారే రవి, కుమార్, జంగిలి రాములు, కారే నాగార్జున, మహేష్, స్వామి, సురేందర్ పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సల కోసం లయన్స్ కంటి ఆసుపత్రికి తరలింపు

మంథని, జనవరి 1: మంథని మండలంలోని పలు గ్రామాల నుంచి లయన్స్ క్లబ్ విజన్ కేర్ ఆధ్వర్యంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు పూదరి దత్తాగౌడ్ సహకారంతో 25 మందిని ఉచిత కంటి శుక్ల శస్త్ర చికిత్సల కోసం లయన్స్ రేకుర్తి కంటి ఆసుపత్రి సోమవారం రోజున తరలించారు. వీరికి ఉచిత రవాణా భోజన వసతులు కల్పించారు. ఉచిత కంటి శస్త్ర చికిత్సలకు సహకరిస్తున్న రేకుర్తి కంటి ఆసుపత్రి వైస్ ఛైర్మన్‌లయన్స్ చిదుర సురేష్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బుద్దార్తి సతీష్ కుమార్, అబ్దుల్ వాసే, మేడగోని రాజమొగిలిగౌడ్, కొత్త శ్రీనివాస్ గుప్తా, అవినాష్, శంషీర్ పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి అన్ని విధాలా సహకారం అందిస్తాం

కోల్‌సిటీటౌన్, జనవరి 1: నూతనంగా ఏర్పాటైన రాజ్యలక్ష్మీ కాలనీ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలో మాజీ కౌన్సిలర్ సీనియర్ ప్రజా నాయకుడు గాజుల రాజమల్లు ఆధ్వర్యంలో సోమవారం సింగరేణి మెడికల్ కాలేజీ పక్కన నూతనంగా ఏర్పాటైన రాజ్యలక్ష్మి కాలనీ ఆర్చిని కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ మహంకాళి స్వామి, ప్రజా ప్రతినిధులు రాజమల్లు దంపతులు, కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి అన్ని విధాల సహకరి స్తామని మరింత అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరే టర్ కలచర్ల కృష్ణవేణి, కల్వ స్వరూప శ్రీనివాస్, సాగంటి శంకర్, దాతు శ్రీనివాస్, పులేందర్, ధూబాసి లలిత మల్లేష్, నాయకులు కాలనీవాసులు కచ్చకాయల సదానందం, గాజుల హరీష్, దబ్బేట శంకర్, ఉరవకొండ రమేష్, కె.పి రాజ్ కుమార్, శంకర్, రమేష్, సమ్మయ్య, రాజేందర్, బేబీ శ్రీనివాస్‌తో పాటు అధిక సంఖ్యలో కాలనీవాసులు మహిళలు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పథకాలు పేదలకు అందాలి'


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎలిగేడు, జనవరి 1: కేంద్ర ప్రభుత్వ పథకాలు నిరుపేదలకు అందేలా కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి అన్నారు. ఎలిగేడు మండలంలోని నారాయణపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం దేశ ప్రధాని నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా సంక్షేమ పథకాల ప్రచారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం ఎల్ఈడీ స్ర్కీన్‌పై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద వర్గాలు, రైతులు, మహిళలకు సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు చేరే విధంగా కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. పీఎం జీవన్‌జ్యోతి, జీవన్‌సురక్ష బీమా పథకాల ద్వారా కేవలం రూ.434చెల్లిస్తే 2లక్షల బీమా వర్తిస్తుందని అన్నారు. మిషన్ వాత్సల్య పథకం ద్వారా తల్లిదండ్రులు లేని అనాథపిల్లలు, ఒంటరి పిల్లలు ఈ పథకం ద్వారా రక్షణ, సంరక్షణ ఇవ్వబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ సునీల్‌కుమార్, ఆరోగ్య మిత్ర సునీత, స్పందన, ఎన్‌జీవో గౌతమి, నాబార్డ్ ఏజీఎం జయప్రకాష్, సునీత, భారత్‌గ్యాస్ ఏజెన్సీ రాఘవేంద్ర, ఆశాలు సరోజిని, పద్మ, విజయ్, రమాదేవి, స్పందన తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ


ఇటుక బట్టీ కార్మికుల పిల్లలకు దుస్తులు అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

కమాన్‌పూర్, జనవరి 1: పెద్దపల్లి జిల్లా రాఘువపూర్ గ్రామ శివారులోని ఇటుక బట్టిలలో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు సోమవారం కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ఆపిల్ కిడ్స్ స్కూల్ కరస్పాండెంట్ చదువు వెంకట్‌రెడ్డి-భారతి దంపతులు బట్టలను పంపిణీ చేశారు.

నేత్ర దానం

కమాన్‌పూర్, జనవరి 1 : కమాన్‌పూర్ మండలం రొంపికుంట గ్రామానికి చెందిన పులిపాక రాజేందర్ అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు ఎల్‌విపి టెక్నిషియన్ రఘు నేత్రదానంపై సోమవారం అవగాహన కల్పించటంతో నేత్రదానం చేసేందుకు అంగీకరించారు. ఈ మేరకు నేత్రాలను సేకరణ చేసి హైద్రాబాద్ ఐ బ్యాంక్ పంపించారు. ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన భార్య జ్యోతి, కుమారుడు శివచందర్, కూతురు శ్రీ విద్య, అన్న శంకర్, తమ్ముడు సతీష్‌ను సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రావన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, డాక్టర్ బీష్మాచారిలు అభినందించారు.ఈ కార్యక్రమంలో నరసింహచారి, వాసు, చంద్రమౌళి, బాణయ్య, మల్లయ్య, బాపు, శ్యాం, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి, కార్యదర్శి శంకర్, డాక్టర్ విజయ్‌కుమార్‌లు ఉన్నారు.

నేడు ఆరు గ్రామాల్లో ప్రజాపాలన సభలు

ధర్మారం, జనవరి1: మండలంలో మంగళవారం ఆరు గ్రామాల్లో ప్రజాపాలన సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి జయశీల ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం కమ్మరీఖాన్‌పేట, పత్తిపాక. రచ్చపల్లి, మధ్యాహ్నం బంజేరుపల్లి, పెర్కపల్లి, రామయ్యపల్లి గ్రామాల్లో ప్రజాపాలన సభలు జరుగుతాయని ఆమె వివరించారు. ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటి పథకాలకు ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

రామగిరి: ఆరు గ్యారెంటి పథకాలపై మంగళవారం మండలంలోని బేగంపేట్, పన్నూరు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రజాపాలన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ రాంచందర్‌రావు, ఎంపీడీవో రమేశ్ సంయుక్తంగా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన కోలేటి

కోల్‌సిటీ, జనవరి 1: పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్ సోమవారం మాజీ మంత్రి కేటీఆర్‌ను హైదరాబాద్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో బీఆర్ఎస్ కేసీఆర్ నాయకత్వంలో మరిన్ని విజయాల్ని ఆకాంక్షించినట్టు తెలిపారు.



భూసేకరణతోనే ఓసీపీ-2 మనుగడ
- ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు

రామగిరి, జనవరి 1: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2 ప్రాజెక్ట్ మనుగడకు భూసేకరణ ఆవశ్యకమని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. సోమవారం రామగిరి అతిథి గృహంలో ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు సంయుక్తంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఓసీపీ-2 భవిష్యత్ కోసం భూసేకరణ ప్రక్రియలో గ్రామస్థులు సహకరం అందించాలని కోరారు. నిర్వాసితులకు చట్టప్రకారం రావాల్సిన నగదు, ఇతరత్రా సౌకర్యాలు కల్పించేందుకు సింగరేణి యాజమాన్యం సుముఖంగా ఉందన్నారు. నూతన సంవత్సరంలో ప్రతీ ఒక్కరు ఆరోగ్యవంతంగా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

● ఆర్జీ-3లో 95శాతం, ఏపీఏలో 102 శాతం ఉత్పత్తి

సింగరేణి సంస్థ ఆర్జీ-3 95శాతం, ఏపీఏ 102 శాతం ఉత్పత్తిని సాధించినట్లు జీఎంలు వెల్లడించారు. డిసెంబరు మాసంలో నిర్దేశించిన 5.60 లక్షల టన్నులకు గాను 5.32 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించి 95 శాతం నిలిచిందన్నారు. బొగ్గు ఉత్పత్తితో పాటు 85శాతం మట్టి(ఓబి)ని సాధించామన్నారు. ఏపీఏ డివిజన్‌లో ప్రాజెక్టుకు నిర్దేశించిన 1.50 లక్షల టన్నులకు గాను 1.53 లక్షల టన్నులు సాధించి 102 శాతం నిలిచిందన్నారు. భవిష్యత్‌లో సైతం సమష్టి కృషితో నిర్దేశిత లక్ష్యాలను సాధించుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో అధికారులు ఎలీషా, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ప్రాజెక్టు అధికారులు రాధాకృష్ణ, శ్రీనివాసులు, రమేశ్, చంద్రశేఖర్, పద్మరాజు, రవీందర్‌రెడ్డి, గుర్రం శ్రీహరి పాల్గొన్నారు.

ఆర్జీ-2 ఏరియా డిసెంబరు ఉత్పత్తి 107 శాతం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 1: ఆర్జీ-2 ఏరియా డిసెంబరు నెలలో 107 శాతం ఉత్పత్తి సాధించినట్టు జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో డిసెంబరు నెల బొగ్గు ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. ఏరియా టార్గెట్ 9.01 లక్షల టన్నులకు టార్గెట్‌కు 9.60 లక్షల టన్నులు(107%) ఉత్పత్తి జరిగినట్టు తెలిపారు. ఓసీపీ-3 లక్ష్యం 8.70 లక్షల టన్నులు కాగా 9.18 లక్షల టన్నుల ఉత్పత్తి(106%) జరిగినట్టు జీఎం తెలిపారు. వకీల్‌పల్లె గని లక్ష్యం 31,600 టన్నులకు గాను 42,101 టన్నుల బొగ్గు ఉత్పత్తి(133%) జరిగినట్టు జీఎం సూర్యనారాయణ పేర్కొన్నారు. 67.24 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ టార్గెట్‌కు 50.19 లక్షల క్యూబిక్ మీటర్లు(75%) వెలికితీసినట్టు జీఎం తెలిపారు. ఏరియా నుండి 8.20 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిగినట్టు తెలిపారు. మార్చి చివరికల్లా లక్ష్యాన్ని చేరుకోవాలంటే రోజు 33వేల టన్నుల బొగ్గు వెలికి తీయాల్సి ఉన్నదని జీఎం తెలిపారు. ఎన్నికల కారణంగా ఉద్యోగులకు రావాల్సిన ప్రమోషన్లు ఇతర అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, త్వరలో వాటిని భర్తీ చేయనున్నట్టు జీఎం పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో అఫిషియేటింగ్ ఎస్వోటూ జీఎం వేణుగోపాల్, అధికారులు పాల్గొన్నారు.

దళితుల ఆత్మగౌరవ పోరాటమే భీమకోరెగావ్

కోల్‌సిటీటౌన్, జనవరి 1: దశాబ్దాల తరబడి దళితులు సామాజికపరంగా ఎదుర్కొంటున్న వెలివేతకు వ్యతిరేకంగా చేసిన పోరాట ఫలితమే భీమకోరెగావ్ విజయమని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి అన్నారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం గోదావరిఖనిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు ఏర్పాటు చేసిన భీమ్ కోరేగాం విజయోత్సవ దినాన్ని ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపల్లి సతీష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మహంకాళి స్వామి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. 204 సంవత్సరాల క్రితం మహారాష్ట్రలోని పూణేకు సమీపాన భీమా నది ఒడ్డున అగ్రవర్ణ అహంకార పూరితులైన 28వేల పిష్వ బ్రాహ్మణులకు, 500 మంది మహర్ వీరుల ఆత్మ గౌరవం కోసం చేసిన పోరాటం దళితుల ఆత్మగౌరవానికి పెద్ద విజయమన్నారు, 28 వేల మంది పీశ్వ సైనికులను 500 మంది మహర్ సైనికులు ఓడించి విజయం సాధించినారన్నారు, మహర్ సైనికులు చేసిన పోరాటంలో 22మంది అమరులైనరన్నారు, ఆత్మగౌరవం కోసం దళితులు మహర్ కోరేగాం వీరులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగా, అంబేద్కర్ సంఘాలు దళిత, సంఘాలు పనిచేయాలన్నారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపెల్లి సతీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లు, కల్వల శిరీష సంజీవ్, దొంత శ్రీనివాస్, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కేంద్ర కమిటీ సభ్యులు, వడ్డపల్లి శంకర్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సీనియర్ జర్నలిస్టు, బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఖైసి రాజేష్ రాష్ట్ర కార్యదర్శి, మంతెన లింగయ్య, సింగరేణి ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షులు, అడుకపురం చంద్రమౌళి, జిల్లా కో కన్వీనర్ దుబాసి బొందయ్య, పోగుల రంగయ్య, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ వైస్ ఛైర్మన్, శనిగరం రామస్వామి, గొర్రె నర్సింగరావు రాసపల్లి రవికుమార్, శనిగరపు హరీష్ పుల్లూరి మహేందర్ పేరుక రవి కల్వల రాజేశం కనుకుంట్ల సమ్మయ్య, జనగామ శంకర్, కుడితల శివ, దళిత సామాజిక హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు చిలుక ప్రసాద్, డాక్టర్ వాసపల్లి ఆనంద్ బాబు మారుతి, సాయి, తదితరులు పాల్గొన్నారు,


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మహంకాళి స్వామి

భవిష్యత్ అవసరాలకు డీసీసీబీ సిబ్బందికి శిక్షణ

కరీంనగర్ టౌన్, జనవరి 1: కరీంనగర్ జిల్లా సహకార సెంట్రల్ బ్యాంకులోని అన్ని స్థాయిల ఉద్యోగులకు భవిష్యత్తు అవసరాల కోసం సన్నద్ధం కావడానికి శిక్షణ ఇస్తామని నాఫ్‌స్కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. సోమవారం నగరంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాబార్డును సంప్రదించి సీనియర్ స్థాయి అధికారులతో సహా అన్ని స్థాయిల అధికారుల కోసం కోర్సులను రూపొందిస్తామని, ఎక్స్‌పోజర్ విజిట్లను, శిక్షణను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామన్నారు. సుపరిపాలన, సాంకేతికత వినియోగంలో డీసీసీబీ ముందుంటుందని తెలిపారు. వ్యాపారం పెంపుదలకు తమ వద్ద పీఏసీఎస్ డెవలప్‌మెంట్ సెల్, బిజినెస్ డెవలప్‌మెంట్ సెల్ ఉన్నాయన్నారు. రానున్న మూడు నెలల కాలంలో రుణాలు, డిపాజిట్ల రికవరీకి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డీసీసీబీకి ఎలాంటి సహకారమైనా అందిస్తామని నాబార్డు డీడీఎం జయప్రకాశ్ తమకు హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీబీ సీఈవో ఎన్ సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ పి రమేష్, డీడీఎం పి మనోహర్‌రెడ్డి, జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో ప్రయాణించింది

గోదావరిఖని, జనవరి 1: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించందని, ప్రతి ఇంటికి సంక్షేమంతో ప్రతి ముఖంలో కేసీఆర్ ఆనందం నింపారని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం స్థానిక చౌరస్తాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నూతన సంవత్స వేడుకలను చందర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలన్నారు. ప్రజల పక్షాన ఉండి ప్రజల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, కార్పొరేటర్లు ఇంజపురి పులేందర్, దొంత శ్రీనివాస్, దాతు శ్రీనివాస్, సాగంటి శంకర్, కల్వచర్ల కృష్ణవేణి, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్